

# 4 నెలలు-ఋతువులు




**నేపథ్యం:** వివిధ కాలాల పేర్లు వాటికి సంబంధించిన చిత్రాలతో పట్టిక తయారు చేయండి. నెలలు ఋతువుల గురించి తెలుసుకోండి.



**చైత్రము వైశాఖంబులము**
**వసంత ఋతువున వచ్చెదము**
**పూవులు పండ్లూ తెచ్చెదము**
**పుష్కలముగ మీకిచ్చెదము...**




**జ్యేష్ఠము ఆషాఢంబులము**
**ఎండాకాలము వచ్చెదము**
**ఎండలు మెండుగ తెచ్చెదము**
**చెప్పులు గొడుగులు కొనిపించెదము**



**శ్రావణ భాద్రపదంబులము**
**వర్షాకాలము వచ్చెదము**
**చెరువులన్ని నిండించెదము**
**పైరులెన్నో పండించెదము**



ఆశ్వయుజ కార్తీకంబులము
శరదృతువున వచ్చెదము
చల్లని వెన్నెల తెచ్చెదము
సంతోషము మీకిచ్చెదము



మార్గశీర్ష పుష్యంబులము
చలికాలంబున వచ్చెదము
చలిచే గడగడలాడించెదము
గొంగళ్ళను కప్పించెదము



మాఘ ఫాల్గుణంబులము
శిశిర ఋతువులో వచ్చెదము
ఆకులన్ని రాల్పించెదము
చెట్లను మోళ్ళుగా చేసెదము...

**I. వినండి-చెప్పండి.**

1. తెలుగు వారాల పేర్లు చెప్పండి.
2. మీకు ఎక్కువ సెలవులు ఏకాలంలో వస్తాయి?
3. కాలములెన్ని ? అవి ఏవి ?
4. వానను గురించిన గేయం పాడండి.

**II. సంభాషించండి.**

1. చెరువులు నిండాలంటే ఏం కావాలి ?
2. వర్షాకాలంలో మనం తడవకుండా ఉపయోగించేవి ఏవి ?
3. చలికాలంలో ఏయే వస్తువులను వెచ్చదనం కోసం ఉపయోగిస్తాం ?

**III. చదవండి-చెప్పండి-రాయండి.**

**అ. ఒక్క వాక్యంలో జవాబులు రాయండి.**

1. వసంతఋతువు ఏ ఏ మాసాలలో వస్తుంది ?
2. వర్షాకాలం ఏయే మాసాల్లో వస్తుంది ?
3. చల్లని వెన్నెల ఇచ్చే ఋతువేది ?
4. చెరువులు నిండే కాలమేది ?

**ఆ. మూడు, నాలుగు వాక్యాల్లో జవాబులు రాయండి.**

1. ఎండాకాలంలో ప్రకృతిలో వచ్చు మార్పులను రాయండి.
2. శిశిరఋతువును వర్ణించండి.

**ఇ. ఖాళీలు పూరించండి.**

1. పూలు పండ్లు తెచ్చెదము ________ మీకిచ్చెదము
2. ఎండాకాలము వచ్చెదము ________ మెండుగ తెచ్చెదము
3. చల్లని వెన్నెల తెచ్చెదము ________ మీకిచ్చెదము
4. మాఘ ఫాల్గుణంబులము ________ ఋతువులో వచ్చెదము.

**ఈ. సరియైన సమాధానం గుర్తించి రాయండి.**

1. పూలు, పండ్లు మెండుగ వచ్చు కాలం
   (అ) శరదృతువు (ఆ) శిశిరఋతువు
   (ఇ) వసంతఋతువు (ఈ) గ్రీష్మఋతువు
2. చెరువులు నిండు మాసం
   (అ) జ్యేష్ఠమాసం (ఆ) శ్రావణమాసం
   (ఇ) కార్తీకమాసం (ఈ) ఫాల్గుణమాసం
3. ఆకులు రాలు ఋతువు
   (అ) శిశిరఋతువు (ఆ) శరదృతువు
   (ఇ) వసంతఋతువు (ఈ) వర్షఋతువు

**IV. భాషావగాహన :**

**అ. సొంత వాక్యాల్లో ఉపయోగించండి.**

1. పుష్కలము
2. గడగడలాడించు
3. మెండుగ

**ఆ. గీతగీసిన పదాలు క్రియ, విశేషణములలో దేనికి చెందినవో రాయండి.**

1. చెప్పులు, గొడుగులు <u>కొనిపించెదము</u>.
2. పైరు లెన్నో <u>పండించెదము</u>.
3. <u>చల్లని</u> వెన్నెల తెచ్చెదము.
4. ఆకులన్ని <u>రాల్పించెదము</u>.

**V. సృజనాత్మకత: జట్టుపని**

వేరువేరు ఋతువుల్లో ప్రకృతిలో వచ్చు మార్పులను చిత్రముల ద్వారా చూపుదాం.

## హరితసైన్యం ప్రాజెక్టు




ఇల్లు-పరిసరాల స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకతల గురించిన నినాదాలను రాయండి. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వీధి నాటికలను ప్రదర్శించండి.

### * సమాచార ఖజానా తెరుద్దాం.

| క్రమ సంఖ్య | మాసములు | ఋతువులు | కాలములు |
|---|---|---|---|
| 1 | చైత్ర, వైశాఖములు | వసంత ఋతువు | ఎండాకాలము |
| 2 | జ్యేష్ఠ, ఆషాఢములు | గ్రీష్మ ఋతువు | |
| 3 | శ్రావణ, భాద్రపదములు | వర్షఋతువు | వానాకాలము |
| 4 | ఆశ్వయుజ, కార్తీకములు | శరదృతువు | |
| 5 | మార్గశిర, పుష్యములు | హేమంతఋతువు | చలికాలము |
| 6 | మాఘ, పాల్గుణములు | శిశిర ఋతువు | |




విశేషణము :-

ఉషా : నా చేతిలో ఏం ఉన్నది ?

రఘు : 'ఆపిల్' పండు.

ఉషా : ఇది ఏ భాషాభాగమును తెలియచేస్తుంది ?

వనజ : నామవాచకము.

ఉషా : ఇది ఏ 'రంగు'లో ఉన్నది ?

కరుణ : **'ఎర్రగా'**

ఉషా : దీని 'రుచి' ఎట్లా ఉంటుంది ?

సలీం : **'తియ్యగా'**

ఉషా : డేవిడ్ ! 'ఎర్రగా, తియ్యగా' అనేవి దేన్ని తెలియజేస్తున్నాయి ?

డేవిడ్ : ఆపిల్ పండు విశేషాన్ని తెలియజేస్తున్నాయి.


ఉషా : కాబట్టి వీటిని మనం ఏమనవచ్చు ?

విద్యార్థులు : 'విశేషాలు'

ఉషా : కాదు. విశేషణము. ఇప్పుడు మీరు విశేషణము అంటే ఏంటో చెప్పండి.

లలిత : నామవాచకము యొక్క విశేషమును తెలుపునది **విశేషణము.**

ఉషా : అంతేకాదు. నామవాచకము యొక్క గుణక్రియాది విశేషములను గురించి తెలియజేయునది విశేషణము.




పండు ఎర్రగా ఉంది.

____________________

____________________

____________________

కింది వాక్యములను గమనించండి.

- ఆ గుర్రము <u>వేగముగా</u> పరుగెత్తుచున్నది.
- ఆమె <u>చక్కగా</u> పాడుచున్నది.
- కిరణ్ అక్షరములను <u>గుండ్రంగా</u>, అందంగా వ్రాయుచున్నాడు.
- వాడు సీతాఫలములను <u>శుభ్రముగా</u> కడిగినాడు.

ఉషా : గీతగీసిన పదాలు భాషాభాగములలో దేనిని తెలియజేయుచున్నవి ?

కిరణ్ : 'విశేషణములు'

ఉషా : సాయి ! ఈ విశేషణములు దేని గురించి తెలియజేయుచున్నవి ?

సాయి : క్రియను గురించి తెలియజేయుచున్నవి ?

ఉషా : స్వరూప్ ! వీటిని మనం ఏమనవచ్చు ?

స్వరూప్ : 'క్రియా విశేషణాలు'

కింది వాక్యాలలో క్రియావిశేషణములను గుర్తించండి.

1) వాళ్ళు ఉత్సాహంగా పని చేయుచున్నారు.

2) కాళ్ళూ, చేతులూ నీరసంతో వేలాడి పోయాయి.